## నాళం కామేశ్వరరావు గారితో ఇంటర్వ్యూ

## నాళం వారి సంగీత సేవ

మా పూర్వీకులు వూరు మండపేట, నాళం వారి మకాములు అని ఉంటాయి. కలకత్తా బరంపురం, రాజమ్రడి మండపేట మొదలైన ప్రాంతాల్లో ఉమ్మడి వ్యాపారం చేస్తుండేవారు. రాజమండ్రి మకాంలో మా తాతగారు నాళం కామరాజు గారుండేవారు. ఆయనకు 5గురు సంతానం. మా నాన్నగారు కనిష్ట- ఆయనకు సంగీతం అంటే అంతా ఇంతా కాదు. చాలా అభిమానం. అంచేత ఇంట్లో అందరికీ సంగీతం రావాలనే ఉద్దేశంతో పిఠాపురం మండి, విజయనగరం నుండి విద్వాంసుల్ని రప్పించి వాళ్ళను ఇంట్లో పెట్టుకొని పోషిస్తూ ఇంట్లో అందరికీ కూడా సంగీతం చెప్పించారు. పోషించడం అంటే ఉచితంగా వసతి ఆదీ ఇవ్వడం భోజన సదుపాయం, నెలకు జీతం ఆ రోజుల్లో 100/- ఉండేది ఇచ్చారు. పాడుగు రామమూర్తి గారని విజయనగరంలో ఆస్థాన విద్వాంసులు ఉండేవారు. ఆయన మా అందరికీ సంగీతం నేర్పడానికి సంవత్సరం పాటు మా ఇంట్లో ఉంచి మా అమ్మగారికి మా అన్నయ్యకు, అక్కయ్యకు నాకు అందరికీ వీణ సంగీతం నేర్పించారు. మా అమ్మగారు నాళం సుశీలమ్మగారు.

ఆంధ్ర మహిళాసభ అని 60సం॥ల క్రితం స్థాపించారు. దాన్ని ఇప్పటికీ మేం నిర్వహిస్తున్నాం దీని ముఖ్యోద్దేశం ఏంటంటే ఆడపిల్లలకు ఉచితంగా వీణ, గాత్రం చెప్పాలని ఏర్పాటు చేసారు మా అమ్మగారు.

పిఠాపురం నుంచి ఈమని అచ్యుతరామశాస్త్రిగారు వచ్చారు. సుమారు 3.4 సం॥లు మా యింట్లో ఉన్నారు. నాళం వారంటే ఇనాందార్లు అని, ఆ ఇనాం ఎక్కడినుండి వచ్చిందంటే ఛత్రపురంలో మాకు ఇనాం భూములు ఉండేవి. అవి బ్రిటీషువాళ్ళు ఒక బ్రాహ్మణుడికి ఇచ్చారు. ఆ బ్రాహ్మణుడి పేరు రాంభట్లు. అయితే ఆ బ్రాహ్మణుడు వ్యవసాయం చెయ్యలేక వాటిని మహమ్మదీయులకు అమ్మేవాడు. మాకు వ్యాపారాలు చాలా చోట్ల ఉండేవి అని చెప్పాను కదా! ఆ సందర్భంలో ఆ మహమ్మదీయులు మాకు బాకీ ఉండి, ఆ బాకీకి డబ్బివ్వలేక ఈ భూమిని ఇచ్చేశారు.

ఇప్పటికీ మేం ఉచితంగానే ఆంధ్ర మహిళాగానసభలో స్త్రీలకు సంగీతం నేర్పుతూ ప్రభుత్వ పరీక్షలకు పంపుతున్నాం.